www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 17 | ఆగస్టు | 2026
పేజీలు : 8

## ఎస్ఎంఎస్ ప్లాంట్ కలుషిత నీరు తాగి 19 మేకలు మృతి



2లో

## యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు







**-యువతతోనే సమాజ మార్పు : బాగం**
**-చింతల వినయ్ నేతృత్వంలో వందలాది మంది సిపిఐలో చేరిక**
**-పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించిన నేతలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ జనాభాలో సగ భాగానికి పైగా కలిగిన యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి రంగాలలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం చింతల వినయ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు సిపిఐలో చేరారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నుంచి ఖానాపురం హవేలీ నాల్గవ డివిజన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపురం హవేలీ సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ముఖ్యంగా ఉపాధి కల్పన రంగాలపై వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. నైపుణ్యత కలిగిన యువతకు సైతం ఉపాధి దొరకడం లేదని నైపుణ్యత లేని వారు ఏదో ఒక రకంగా ఉపాధి పొందెందుకు ప్రయత్నిస్తుంటే పాలకులు రకరకాల చట్టాలతో బతక లేని పరిస్థితిని సృష్టిస్తున్నారని హేమంతరావు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన

మిగతా 2లో..

## ఆర్‌ఎంపీల దగ్గరకెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త..!

**-ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యంతో ప్రాణం పోతోంది..**
**-చీమకుట్టినా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్**
**-బలవుతున్న గ్రామీణప్రాంత ప్రజలు**
**-విచ్చలవిడిగా క్లినిక్, మెడికల్ షాపులు, ల్యాబ్‌లు**
**-కొరవడిన జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుతం ప్రాథమిక వైద్య చికిత్సల పేరుతో ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్లను పొందిన వారు వైద్యుల అవతారం ఎత్తేశారు. కాలు తెగినా కట్టు కట్టాలే తప్ప కుట్లు వేయడానికి అర్హత లేని వారు డాక్టర్ బోర్డులు పెట్టుకుని క్లినిక్‌లు, ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. మరి కొంతమంది మెడికల్ షాపులు, ఆసుపత్రులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సినిమాలో శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమా చేయడానికి మోసం చేస్తే నిజ జీవితంలో ఆర్ఎంపీలు ఏకం గా వైద్యం చేసేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కొన్ని చోట్ల ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని మాల బంజరలో ఓ ఆర్ఎంపీ వైద్యం వికటించి ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కంటతడిపెట్టించింది. ఖమ్మం జిల్లా బస్వాపురానికి చెందిన హేమశ్రీ దగ్గు, జలుబుతో బాధపడుతుండగా పేరెంట్స్ ఆర్ఎంపి వైద్యుడు దగ్గర తీసుకెళ్లగా వైద్యం వికటించి మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్తులు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించిన నిరుపేద కుటుంబాలలో కొందరు ఆర్ఎంపీ వైద్యుల వైద్యానికి బలవుతూనే ఉన్నారు. భద్రాద్రి జూలూరుపాడు మండల పరిధిలోని సుమారు ఐదు వేల మందికిపైగా ఆర్ఎంపీలు, పీఎంపీలుగా పనిచేస్తున్నారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులుగా అవతారం ఎత్తి సూపర్ స్పెషలిస్టులుగా వెలుగొందే ప్రయత్నాలు చేస్తూ ప్రజలపై తమ వైద్య ప్రయోగాలు చేస్తున్నారు. మరికొంత

మిగతా 2లో..

## విప్లవ స్వాప్నికుడు చంద్రశేఖర్






**-వ్యక్తిగత విషాదం కాదు- ఉద్యమ ఒత్తిళ్లే**
**-రాయల చంద్రశేఖర్ పుస్తకావిష్కరణ సభలో వక్తలు**
**-కమ్యూనిస్టులు ఐక్యం కావాలి : కూనంనేని**
**-సమీక్ష అవసరం : సతీష్ చందర్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు విప్లవాన్ని స్వప్నించి దానిని నిజం చేయడం కోసం పని చేసిన ఉత్తమ కమ్యూనిస్టు రాయల చంద్రశేఖర్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆత్మహత్య అది వ్యక్తిగత విషాదం కాదని ఉద్యమంలో సహచరులతో వచ్చిన ఒత్తిళ్లే కారణమని దీనిపై లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి వివిధ హోదాలలో పనిచేసిన రాయల చంద్రశేఖర్ జీవితానికి సంబంధించిన రెండు పుస్తకాలను ఆదివారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఆయన సహచరి రాయల విమల రాసిన ఓ భగ్న విప్లవ ప్రేమికుడు రాయల చంద్రశేఖర్ అనే పుస్తకంతో పాటు చంద్రశేఖర్ మృతి తర్వాత సహచరులు, బంధుమిత్రులు వ్యక్తం చేసిన అభిప్రాయాలతో మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవి నల్లమోతు

మిగతా 2లో..

## అర్హులైన ప్రతి ఓటును పరిరక్షించాలి

**-బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించడమే బిఆర్ఎస్ ముఖ్య ఉద్దేశ్యమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఖమ్మం ఖానాపురం హవేలీ బిఎల్‌ఏ, బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశం గోపాలపురంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. బిఆర్ఎస్ శ్రేణులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆదేశాల మేరకు ఖమ్మం నియోజక వర్గంలో పార్టీ బిఎల్‌ఏలు, నాయకులు క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుగ్గా వ్యవహరించి విశేషమైన కృషి చేశారన్నారు. ప్రతి ఇంటిని పరిశీలించి బిఎల్‌ఏలు, బిఎల్‌వోలకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నియోజక వర్గంలో సుమారు 3,28,000 ఓట్లు ఉండేవని సవరణ ప్రక్రియ నాటికి అవి 2, 48,000కు చేరాయని దాదాపు 80వేల ఓట్లు మార్పు జరిగిందన్నారు. మారే రాజకీయ గాలివాటాలను బట్టి కొందరు అటు ఇటు మారినప్పటికీ కేసిఆర్ నాయకత్వంపై, బిఆర్ఎస్ సిద్ధాంతాలపై నమ్మకంతో నిలబడిన నిజమైన కార్యకర్తలే పార్టీ అసలైన బలమన్నారు. పార్టీ నాయకులు, శ్రేణులు, ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను చివరి వరకు పర్యవేక్షించి ఎలాంటి

మిగతా 2లో..

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

**(మొదటిపేజీ తరువాయి)** తర్వాత ఎక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా యావత్ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టి దేశాన్ని ప్రైవేటీకరణ వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు ఎదురు లేదనుకుంటున్న మోడీని ఈ దేశ యువశక్తి మెడలు వంచిందని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పోరాటంతో మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని ఆయన తెలిపారు. రాజకీయాల్లో అవినీతిపై యువత భగ్గుమంటున్న సమయంలో యువతకు మద్దతుగా నిలుస్తూ యువజన పోరాటాల్లో పాలుపంచుకున్న సిపిఐలో యువకులు చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని హేమంతరావు తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన విషయంలో ఆడిన మాట తప్పిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక డిక్లరేషన్లు ఇచ్చిందని ఏ డిక్లరేషన్‌ను అమలు చేసే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన అనేక పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్న సిపిఐ ఇటీవల జన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా ఉద్యమాలకు నూతన జవసత్వాలను తీసుకు వచ్చిందన్నారు. చింతల వినయ్‌తో సహా పార్టీలో చేరిన వారందరిని సిపిఐ సగర్వంగా ఆహ్వానిస్తుందని హేమంతరావు



తెలిపారు.ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించగా ఆహుతులను హవేలీ సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాపనేని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్,విజయ్, రాకేష్, పవన్, రాజు, కిషోర్, కిరణ్, రంజిత్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి సిపిఐలోకి ఆహ్వానించారు.

# ఎస్ఎంఎస్ ప్లాంట్ కలుషిత నీరు తాగి 19 మేకల మృతి

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంట్ నుండి వెలువడే కలుషిత నీరు వల్ల అనేక మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. సమితి సింగారం చెందిన రాచకొండ రాములుకు చెందిన 19 మేకలు ఎస్ఎంఎస్ ప్లాంట్ నుండి వెలువడే కలుషిత నీటిని తాగి మృతి చెందాయి. గతంలో కూడా అనేక పర్యాయాలు ఈ నీరు దాగి మూగజీవాలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. గతంలో సాయిలు కి చెందిన 20 మేకలు, ఇస్లాక్ చెందిన 40 మేకలు కూడా ఈ నీరు తాగి మృతిచెందినట్లు ఆరోపణలు ఉన్నాయి.. ఈ ప్లాంట్ నుండి వెలువడే కలుషిత నీటినే వాగుల్లోకి పంపించకుండా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకొని మూగ జీవుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**సింగరేణి అధికారుల పర్యవేక్షణ లేదు..**

**ఏఐటియుసి రామ్ గోపాల్**



ఎక్స్ప్లోజివ్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారిశ్రామిక ప్రక్రియలో వెలువడే వ్యర్థ జలాలను నిబంధనల ప్రకారం శుద్ధి చేసి, సురక్షితంగా నిర్వహించాల్సి ఉండగా అవి బయటకు ప్రవహిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వ్యర్థ జలాలు సమీప ప్రాంతాల్లోకి చేరి.. పశువుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 18 మేకల మృతికి ఈ నీరే కారణమా? అన్నది తేల్చాల్సిన బాధ్యత సింగరేణి అధికారులపై ఉంది.

# అర్హులైన ప్రతి ఓటును పరిరక్షించాలి



**(మొదటిపేజీ తరువాయి)** పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు.

**మంత్రి తుమ్మల అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు :**

ఖమ్మం నియోజక వర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గతంలో తనపై కాశీంరజ్వీ అంటూ తప్పుడు ప్రచారం చేసిన వారు ప్రస్తుతం మంత్రి తుమ్మలతో పాటు ఆయన కుమారుని పక్కన ఉంటూ అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. ఇసుక, మట్టి, భూములను దోచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఖమ్మం బస్టాండ్‌ను గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తే దానిపై అనేక మంది విమర్శలు చేశారన్నారు. గోళ్లపాడు ఛానెల్‌ను సుందరంగా తీర్చిదిద్దామని, మున్నేటిపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాలకు కేసిఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వాటికి నిధులు విడుదలతో పాటు జీవోను జారీ చేసిందన్నారు. మున్నేరు వరద బాధితులకు శాశ్వతంగా అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు కల్పించినా బిఆర్ఎస్ పార్టీతోనే కార్యకర్తలు ఉన్నారని పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటామన్నారు. బిఆర్ఎస్ హయాంలోనే ఖమ్మం నగర అభివృద్ధి జరిగిందన్నారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని తాను ఖమ్మం నియోజక వర్గం నుంచే పోటీ చేస్తానని పువ్వాడ తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మం నియోజక వర్గంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్,పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తుల మురళీ, దేవభక్తిని కిషోర్‌బాబు, మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, దండా జ్యోతిరెడ్డి, బిక్కసాని జశ్వంత్, వాంకుడోత్ సురేష్, కందాళ వీరేందర్, వల్లభనేని రామారావు, లింగనబోయిన లక్ష్మణ్, కోలేటి రాధాకృష్ణ, షకీనా, గాదె అనిల్ పాల్గొన్నారు.

# ఆర్‌ఎంపీల దగ్గరకెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త..!

**(మొదటిపేజీ తరువాయి)**

మంది తమ హస్తవాసి మంచిదంటూ అధిక డోసులు వాడి ప్రాణాలు మీదికి తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళ ప్రభుత్వ వైద్యులు, క్వాలిఫైడ్ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తెల్లవారితే గ్రామీణ ప్రాంత ప్రజల గుమ్మంలో వాలుతున్నారు. సమయానికి వైద్యం చేయడంతో ప్రజల్లో వారిపై నమ్మకం కలుగుతోంది.



**యాంటీ 'భయా' టిక్స్..!**

కొందరు ఆర్‌ఎంపీలు ప్రమాదకర యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ రాస్తున్నారు. చీమకుట్టి దద్దుర్లు వచ్చినా ఇవే. ఉమ్మడి జిల్లాలో పది సాధారణ మరణాలు జరిగితే పరోక్షంగా ఆర్‌ఎంపీల ప్రభావం 50 శాతం ఉంటుందని చెప్పవచ్చు. వారు ఇచ్చిన స్టెరాయిడ్స్, అత్యధిక పవర్ కల్గిన యాంటీబయోటిక్స్ వల్ల తదుపరి వైద్యం చేయడానికి ఆస్కారం లేకుండా పోతుంది.

**కార్పొరేట్ హాస్పిటల్స్‌తో ఒప్పందం...**

కొంత మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని తమ ప్రాంతాల నుంచి రోగులను పంపించి పర్సంటేజీలను అందుకుంటున్నారు. ఇంకా కొంత మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు జనరిక్ మందులను కొనుగోలు చేసి ప్రజలకు ఇచ్చి అడ్డంగా సొమ్ములను వసూలు చేసుకుంటున్నారు, గిరిజన ప్రాంతాల్లో వారి హవా ఎక్కువ.

**వృద్ధుల ప్రాణాలతో చెలగాటం..**

కొంత మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు వృద్ధుల ప్రాణాలతోనే చెలగాటం అడుతున్నారు. వృద్ధులు దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్లలేక, తమ కుటుంబ సభ్యులకు ఖాళీలేక ఊరిలో ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు ఆ క్షణంలో ఆర్‌ఎంపీలు సూపర్ స్పెషలిస్టులుగా అవతారం ఎత్తి యాంటీబయోటిక్స్‌ను, స్టెరాయిడ్స్‌ను ఇవ్వడంతో వారు కోలుకుంటున్నారు. కానీ చాపకింద నీరులా ఆ మందులు వాడినాక వ్యాధి నిరోధక శక్తి క్రమేపీ తగ్గిపోతుంది. తరువాత చిన్న వ్యాధిని కూడా తగ్గించు కోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**షుగర్.. బీపీ సమస్యలు..!**

ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యం చేయించుకున్న వారికి 15 ఏళ్లలోపే షుగరు, బీపీలు వస్తున్నాయని నిపుణులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై తనిఖీలు లేకపోవడంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు. కేవలం ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్ లేదా ప్రైవేటు మెడికల్ ప్రాక్టీసనర్ సర్టిఫికెట్ పొంది వైద్యుల అవతారం ఎత్తుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి ప్రజల ప్రాణాలు గాలిలో కలవకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

**ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలి..!**

ఆర్‌ఎంపీ, పీఎంపీల వైద్య సేవలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ప్రజలు ప్రాణాలకు ముప్పు తలెత్తింది. అరకొర పరిజ్ఞానంతో కొంత మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ ఇచ్చేస్తున్నారు. దీనివల్ల ఆ పేషెంటుకు భవిష్యత్తులో ఎలాంటి వ్యాధి వచ్చినా మందులు పనిచేయడం లేదు. ఆర్‌ఎంపీల వైద్యం వికటించి ప్రాణాలు పోతున్నాయి. తెలిసీతెలియని వైద్యంతో మానవ శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతోంది. దీనివల్ల చిన్న వయసులోనే షుగరు, బీపీ, కిడ్నీలు పోవడం, కాలేయం వంటి అవయవాలు, ఎముకల వ్యాధులు వస్తున్నాయి. ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలి.

# విప్లవ స్వాప్నికుడు చంద్రశేఖర్



**(మొదటిపేజీ తరువాయి)**

తిరుమలరావు అధ్యక్షత వహించిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ మృతి విచారించదగినదన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులు, పాలకుల నిర్ణయాల నేపథ్యంలో కమ్యూనిస్టులంతా ఒకటి కావాల్సి ఉందని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రానున్న కాలంలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరగనుందని ఈ సందర్భంలో రాయల చంద్రశేఖర్ లాంటి వ్యక్తులు ఉద్యమానికి అంకితమై పనిచేసి మన నుండి దూరం కావడం అత్యంత బాధాకరమన్నారు. పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సంపాదకులు సతీష్‌చందర్ మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్‌ది వర్గ విబేధాలకు తావివ్వని జీవితమని నాలుగున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాలలో, ప్రజా ఉద్యమాలలో పని చేశారన్నారు. ఒక వ్యక్తిని బలహీనమైన క్షణాలకు నెట్టివేసే పరిస్థితులకు ఎవరు కారణమనే దానిపైన సమీక్షించాల్సిన అవసరం ఉందని సతీష్ చందర్ పేర్కొన్నారు. విప్లవోద్యమం బయట నుంచి చూసే వారికి, అంతర్గతంగా పనిచేస్తున్న వారికి ఉన్న సంబంధాన్ని పాలకులు ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కరచలనం చేసిన చేతులను మళ్లీ తాకుతామో లేదన్న భావన బలపడుతుందని ఈ పరిస్థితులకు ఎదురోడ్డాల్సిన స్థితిలో చంద్రశేఖర్ లాంటి వ్యక్తులు దూరమవుతున్నారన్నారు. ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షులు టి.ప్రసాద్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఏడు ప్రాంతాల్లో తిరుగుతూ విప్లవోద్యమంలో పనిచేశారని ఆయన మృతిపై అన్ని స్థాయిల్లోనూ విచారణ జరగాల్సి ఉందన్నారు. చంద్రశేఖర్ సహచరి విమల మాట్లాడుతూ విప్లవోద్యమంలో పనిచేసిన తమపై నేరస్తులుగా ముద్రవేసే ప్రయత్నాలు జరిగాయని తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు సమాజం దృష్టికి తీసుకు వచ్చేందుకు పుస్తకం ప్రజల ముందకు తెచ్చామన్నారు. రాయల చంద్రశేఖర్ మృతిని ఆత్మహత్యగా కాకుండా హత్యగా అనుమానించాల్సిన పరిస్థితులు ఉన్నాయంటూ కొందరు తీవ్ర ఆరోపణలు చేశారు. మొత్తంగా విప్లవోద్యమానికి చంద్రశేఖర్ చేసిన కృషిని అభినందించారు. ఈ సభలో ఏఐకెఎంఎస్ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు బొంతు రాంబాబు, సిపిఐ నాయకురాలు పోటుకళావతి, ఐఎఫ్‌టియు నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, పివోడబ్ల్యూ నాయకులు ఝాన్సీ, గౌరి, పద్మ, సమాచార హక్కు కమిషనర్ శ్రీనివాసరావు, కెవై రాంచందర్‌రావు, గౌని ఐలయ్య పాల్గొన్నారు.

# వైరా ఆయకట్టు రైతులకు సాగునీరు ఇవ్వాలి

**-అఖిలపక్షం డిమాండ్**
**-నేడు నీటిపారుదలశాఖ కార్యాలయం ఎదుట నిరసన**



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి సాగుకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సాగునీటి విడుదలపై ప్రభుత్వం అధికారులు స్పష్టత ఇవ్వాలని, నీరు అందించకపోతే రైతులతో కలిసి విస్తృత ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వైరాలోని మిట్టపల్లి గార్డెన్స్‌లో ఆదివారం సిపిఎం మండల కన్వీనర్ సుంకర సుధాకర్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వరరావు, సిపిఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సుమారు 17500 హెక్టార్లలో వరి సాగు జరుగుతుందని, ఈ ప్రాంత రైతులకు వరి సాగు ప్రధాన జీవనాధారమని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 17.5 అడుగుల నీటిమట్టం ఉన్నప్పటికీ వరి సాగుకు నీరు అందించలేమని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికే రైతులు విత్తనాలు జల్లడం, నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో సాగునీరు ఇవ్వలేమని చెప్పడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చి అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నామంటూ నీటి విడుదలను నిలిపివేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్‌కు రావాల్సిన గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. వైరా ఆయకట్టు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌పై రైతులు ఆగ్రహం వ్యక్తమవుతుందని హెచ్చరించారు. సాగునీటి సమస్యపై సోమవారం వైరా నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ నాయకులు లాల్‌మియా, తోట నాగేశ్వరరావు, మద్దెల రవి, హరి వెంకటేశ్వరరావు, మల్లెంపాటి రామారావు, కొంగర సుధాకర్, కామినేని రవి, బట్టా భద్రయ్య, మరికంటి శివ, ఏదునూరి శ్రీను, షేక్ సైదా, చింతయ్య, మాడపాటి వెంకటి, షేక్ నాగుల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో మధిరకు అవినీతి మరకలు

**-రైతులు, వ్యాపారుల జీవితాలతో చెలగాటం**
**-జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్**



**ప్రజాపక్షం/మధిర:** ఒకప్పుడు చరిత్ర, త్యాగాలు, విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మధిరను నేడు కమీషన్ల మధిరగా మార్చే పరిస్థితి తీసుకొచ్చారని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మధిరలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మధిరలోని బిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిరకు ఔటర్ రింగు రోడ్డు అవసరం లేదని వాహనాలు తగ్గిపోతే చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పేరుతో చిరు వ్యాపారుల ర్యాంపులు, బ్లెంపులు, సన్‌సైడ్లు, బోర్డులు తొలగించారన్నారు. ఖమ్మం, వరంగల్ వంటి నగరాలకు లేని ఔటర్ రింగు రోడ్డు మధిరకు ఎందుకు అవసరమని కమల్‌రాజు నిలదీశారు. ఓఆర్ఆర్ పేరుతో వందల ఎకరాల వ్యవసాయ భూములు సేకరిస్తున్నారని, రైతులకు మార్కెట్ విలువకు తగిన పరిహారం అందించకుండా భూములు తీసుకుంటే తీవ్ర అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. ఓఆర్ఆర్‌కు కేటాయిస్తున్న నిధులతో మధిరకు వచ్చే ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేసి పట్టణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. మధిర చుట్టూ ప్రతిపాదిస్తున్న ఔటర్ రింగు రోడ్డు ఉద్దేశం, భూముల సేకరణ, రైతులకు అందించే పరిహారం, పట్టణ వ్యాపారాలపై పడే ప్రభావంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కమల్‌రాజు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లింగాల కమల్‌రాజు, చిత్తారు నాగేశ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, యన్నంశెట్టి వెంకట అప్పారావు, అరిగె శ్రీనివాసరావు, రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బొగ్గుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే బిఆర్ఎస్ విధానం



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంనందు మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మధిరలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ నాయకుడు లింగాల కమల్‌రాజు కడుపు మండుతుందని, పదేళ్లు అధికారంలో ఉండి మిరను దోచుకొని తిని, ఇప్పుడు కాంగ్రెస్ చేస్తునన పనులను చూసి ఓర్వలేక బురదజల్లుతున్నారు అన్నారు. మధిరకు మీరు తెచ్చిన నిధులు ఎన్ని? వేసిన రోడ్డు ఎన్ని కిలోమీటర్లు?కట్టిన డ్రైనేజీ ఉందా? యువతకు ఉపాధి ఇచ్చే ఒక్క ప్రాజెక్టు అయినా ఉందా? సమాధానం లేదు. ఎందుకంటే మీ అజెండా అంతా కమీషన్లు, కుటుంబ పాలన, బినామీ భూముల చుట్టూనే తిరిగింది. మీరు చేసిన అభివృద్ధి ఏంటో ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, రివర్‌ఫ్రంట్, రిటైనింగ్ వాల్, కొత్త బస్టాండ్, మినీ స్టేడియం, ఐటి హబ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలతో మధిర రేపురేఖలు మారుతున్నాయని, ఇవన్నీ ప్రజల అవసరాల కోసం చేపడుతున్న పనులేనని స్పష్టం చేశారు. రైతులను, వ్యాపారులను రెచ్చగొట్టి రాజకీయం పబ్బం గడుపుకోవాలని చూడకంటి అని లింగాల కమల్‌రాజును ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం రైతుకు నష్టం లేకుండా, వ్యాపారాలకు ఇబ్బంది లేకుండా శాస్త్రీయంగా ప్లాన్ చేస్తుందన్నారు. రింగు రోడ్డు వస్తే నిజానికి ట్రాఫిక్ తగ్గి మధిర హబ్‌గా మారి వ్యాపారాలు రెట్టింపు అవుతాయని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉండి మధిరకు చేయలేని అభివృద్ధిని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందంటే దానిని స్వాగతించాల్సింది పోయి అడ్డుకోవడం బిఆర్ఎస్ నాయకుల రాజకీయ అసహనానికి నిదర్శనం అని అన్నారు. ఈ సమావేశంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల సూరంశెట్టి కిషోర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, పట్టణ కాంగ్రెస్ నాయకులు జహంగీర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పమ్మి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని పమ్మి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు కొలిక పొంగు వెంకట్రావు, గూడూరు వీరస్వామి పేర్కొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాయబారపు ఉపేందర్‌రావు, అధికార ప్రతినిధిగా రాయబారపు నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీకి వారు శుభాకాంక్షలు తెలిపారు. సమాజ అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పమ్మి ఎంఆర్‌పీఎస్ నాయకులు రాయబారపు నాగబాబు, కొండమీద రఘుపతి, రాయబారపు( మునగాల) వీరబాబు, రాయబారపు ఇంద్ర, విజయరావు, సురేశ్, కళ్యాణ్, గోపి ఠాగూర్, మునగాల ఉపేందర్, పుట్టా నర్సింహారావు, సొరకాయ రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/చింతకాని :** మండల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్నాహ్నం 1గంటవరకు జరిగే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి పరిష్కరించుకునే అవకాశం ప్రజావాణి ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ప్రజావాణి కి హాజరై తమ వినతులు నేరుగా అందజేయవచ్చని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీడీవో కోరారు.

# ఉత్తమ అధికారిగా ఏపిఓ కృష్ణకుమారి



**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్( గ్రామీణ్)(విబిజి రాంజీ) అదనపు పోగ్రాం అఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బసవోజు కృష్ణకుమారి ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. అదే కార్యాలయానికి చెందిన కంప్యూటర్ అపరేటర్ ఎం లావణ్య ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. ఆగష్టు 15 సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా కృష్ణకుమారి, లావణ్యలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసినందుకు ఈ గుర్తింపు లభించదని అధికారులు తెలిపారు.

# పాఠశాలకు బల్లల వితరణ



**ప్రజాపక్షం/వైరా:** ఎంపి యుపిఎస్ కృష్ణారావు పాఠశాల విద్యార్థులకు 10 బల్లలను గ్రామ మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మాజీ ఇంటర్మీడియట్ బోర్డు మెంబర్ కర్నాటి రామ్మోహన్‌రావులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వందనపు సునీత మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామంలోని పాఠశాల విద్యార్థుల కనీస అవసరాలు గుర్తించి బల్లలను విరాళంగా ప్రకటించి అందజేయడం గొప్ప విషయమని అన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ పథకాలను పొందాలని అన్నారు. అనంతరం కర్నాటి రామారావును ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కొత్తపల్లి నర్సింహారావు, ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, కోట జ్యోతి, వూట్ల కొండలరావు, చావా విజయమ్మ, చావా రమేష్‌బాబు, రిటైర్డ్ హెడ్మాస్టర్ కర్నాటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మానసకు ఉత్తమ సేవా పురస్కారం



**ప్రజాపక్షం/మధిర:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చేతుల మీదుగా ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో వై.మానస ఉత్తమ సేవా పత్రం అందుకున్నారు. మధిర తహశీల్దార్ కార్యాలయంలో వై.మానస జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ పురస్కారం అందుకున్న మానసను మధిర తహశీల్దార్, ఉద్యోగులు, సిబ్బంది, అభినందనలు తెలియజేశారు.

# తలసేమియా చిన్నారులకు రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని చిరుమర్రి గ్రామంలో సామినేని వెంకయ్య, కుసుమాంబ, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం రుధిరం ఛారిటీ ట్రస్ట్, సంకల్ప ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుధిరం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు సామినేని రాకేశ్ మాట్లాడారు. తలసేమియా చిన్నారుల ప్రాణాలు నిలివాలంటే నిరంతరం రక్తం అవసరమని, రక్తదాతలు ఇచ్చే ప్రతీ రక్తపు బొట్టు చిన్నారులకు పునర్జన్మ ఇస్తుందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహంచి అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రక్తదాతలను ఘనంగా సన్మానించారు.

# నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం

**- ఆపరేషన్ కోసం రూ.10వేల ఆర్థికసహాయం అందజేసిన కిషోర్‌నాయక్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఏదులాపురంమున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషోర్ నాయక్ ఆపన్నహస్తం అందించారు. ఆపరేషన్ చేయించుకోవాల్సిన కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఆయన, మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన కిషోర్ నాయక్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ బానోత్ పుల్‌చంద్, 5వ వార్డు కౌన్సిలర్ బానోత్ ప్రసాద్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకులంలో ర్యాగింగ్ కలకలం

**-10వ తరగతి విద్యార్థులపై ఇంటర్ విద్యార్థుల దాడి ఆరోపణలు**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం గాంధీపురలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఇంటర్ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులను గదిలోకి తీసుకెళ్లి బట్టలు విప్పించి తీవ్రంగా కొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో కబడ్డీలో 10వ తరగతి విద్యార్థులు విజయం సాధించడమే ఘటనకు కారణంగా తెలుస్తోంది. శనివారం అర్ధరాత్రి దాడి జరిగినట్లు బాధిత విద్యార్థులు పేర్కొన్నట్లు సమాచారం. భయంతో కొందరు విద్యార్థులు రాత్రంతా రైల్వే స్టేషన్, సమీప ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురుకులానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కారేపల్లి పోలీసులు పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై, బాధ్యత వహించాల్సిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## ఇల్లందు నుంచి మియాపూర్‌కు బస్సు

**-ప్రారంభించిన చైర్ పర్సన్ దొడ్డ కిరణ మిత్ర డానియల్**



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు నుంచి మియాపూర్‌కు నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఆదివారం ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ మిత్ర డానియల్ ప్రారంభించారు. ఈ బస్సు ఇల్లందు, బయ్యారం, మహబూబాబాద్, తొర్రూరు మీదుగా మియాపూర్ చేరుకోనుంది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సర్వీస్‌తో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, జిల్లా నాయకులు, వార్డు కౌన్సిలర్లు, మహిళా, యువజన విభాగాల నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సమ్మక్క, సారలమ్మ దర్శించుకున్న ఎంఎల్ఏ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఆసియా ఖండంలో ప్రసిద్ధి చెందిన మేడారి సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను తెలంగాణ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)తో కలిసి ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎంఎల్ఏ వెంట ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, తదితరులు ఉన్నారు.

## రమకు రూ.40వేల ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఇల్లందు:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇల్లందు మడలం మామిడిగుండాల గ్రామానికి చెందిన కల్తి రమకు ఆదివాసీ హెల్ప్‌లైన్ ఇల్లందు సభ్యులు రూ 40వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల సీతానగరం నుంచి తిరిగి వస్తుండగా లారీ ఢీ కొనడంతో రమ కుడికాలు తీవ్రంగా దెబ్బతినగా, ఎడమకాలు విరిగింది. చికిత్సకు సుమారు రూ 7లక్షలు అవసరం కావడంతో ఆమె భర్త కల్తి రామయ్య ఆదివాసీ హెల్ప్‌లైన్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, దాతలు అందించిన విరాళాలతో సమకూరిన రూ 40వేల నగదును హెల్ప్‌లైన్ సభ్యులు రామయ్యకు అందజేశారు. ఈకార్యక్రమంలో హెల్ప్‌లైన్ వ్యవస్థాపకులు కబ్బాకుల రవి, అధ్యక్షుడు కుర్సం అంజయ్య, ఉపాధ్యక్షులు చాపల రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు కొండం కృష్ణయ్య, మోకాళ్ల మోహన్‌రావు, పూణెం బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ నీరు కామేపల్లికి అందించాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** సీతారామ ప్రాజెక్టు ద్వారా పాలేరుకు నీరందించే కాలువ పనులను వెంటనే పూర్తి చేసి, కామేపల్లి మండలానికి సాగునీరు అందించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. తాళ్లగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా టీడీపీ నాయకులు ఆరెం రామయ్య, కామేపల్లి మండల అధ్యక్షుడు పుచ్చకల సత్యనారాయణ, ఏన్కూరు మండల అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ 20లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. భూ నిర్వాసితులకు సకాలంలో పరిహారం అందించకపోతే టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## రోగులకు శాపంగా పెద్దాసుపత్రి పేషెంట్ కేర్ సేవలు..!

-స్ట్రెచర్లు, వీల్‌చైర్లు దయనీయ స్థితిలో
-అత్యవసర వేళ బంధువులే భరోసా
-సిబ్బంది స్పందనపై ఆరోపణలు..
విచారణకు ప్రజల డిమాండ్








**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే ప్రమాద బాధితులకు వెంటనే అందాల్సిన అత్యవసర పేషెంట్ కేర్ సేవలు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రశ్నార్థకంగా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పేషెంట్ కేర్ వ్యవస్థ క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేయడం లేదని రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో లేకపోవడం, ఉన్న వాటిలో కొన్ని విరిగిపోయి పనికి రాని స్థితిలో ఉండటం, అత్యవసర సమయంలో పేషెంట్ కేర్ సిబ్బంది స్పందన ఆలస్యమవుతోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అత్యవసర విభాగానికి వచ్చిన ప్రమాద బాధితులను వెంటనే చికిత్సకు తరలించాల్సిన పరిస్థితుల్లో స్ట్రెచర్, వీల్‌చైర్ కోసం రోగుల బంధువులే వెతుక్కోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఒక వీల్‌చెర్‌ను ఒక పేషంట్‌కు వినియోగిస్తుంటే, మరొక పేషంట్ బంధువు వీల్‌చెర్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల పాతవి, తుప్పుపట్టినవి, విరిగిపోయిన వీల్‌చైర్లు, స్ట్రెచర్లు మాత్రమే కనిపిస్తున్నాయని, వాటిని ఉపయోగించడమే ప్రమాదకరంగా మారిందని ఆరోపిస్తున్నారు. ఒక సందర్భంలో పనికిరాని స్ట్రెచర్‌పై రోగిని తరలించే ప్రయత్నంలో కింద పడిన ఘటన కూడా జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులు, నిరక్షరాస్యుల పట్ల కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల 108 అంబులెన్స్‌లో ముగ్గురు ప్రమాద బాధితులను తీసుకొచ్చిన సమయంలో కూడా అవసరమైన సహకారం అందలేదని, ప్రశ్నించిన వారిపైనే అసహనం వ్యక్తం చేశారని చెబుతున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ విలేకరిని ఆసుపత్రికి తరలించిన సమయంలో కూడా స్ట్రెచర్, వీల్‌చైర్ అందించడంలో ఆలస్యం జరిగిందని, రోగిని అత్యవసర విభాగానికి తరలించేందుకు బంధువులే కష్టపడాల్సి వచ్చిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి ఆవరణలో పాతవి, దెబ్బతిన్న వీల్‌చైర్లు, స్ట్రెచర్లు కనిపించడం నిర్వహణలో లోపాలకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైన సమయంలో రోగులకు సకాలంలో సహాయం అందకపోతే ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని వైద్య వర్గాలు కూడా పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పేషెంట్ కేర్ సేవలపై వస్తున్న ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, అత్యవసర విభాగంలో తగిన సంఖ్యలో నూతన స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచి, పేషెంట్ కేర్ సేవలను పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్‌లో వర్గపోరు

-నాలుగు వర్గాలు విడిపోయిన పార్టీ
-ఎంఎల్‌ఏకు తలనొప్పిగా మారిన కామేపల్లి మం.



కామేపల్లి కాంగ్రెస్‌లో వర్గ పోరు

**ప్రజాపక్షం/కామేపల్లి:** అధికార కాంగ్రెస్ పార్టీ కామేపల్లి మండలంలో నాలుగు వర్గాలుగా విడిపోయింది. ఎవరికి వర్గం వారు తమ ఆధిపత్యాన్ని సాగిస్తున్నారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంది కాంగ్రెస్ పరిస్థితి. మండలంలో ముగ్గురు మంత్రులకు మూడు వర్గాలు ఉండగా అసలైన పాత కాంగ్రెస్ రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి వర్గం బలంగా ఉంది. ఎవరికి వారే వర్గ పోరును నిరూపించుకుంటున్నారు. దీంతో నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలు వర్గపోరులో నలుగుతున్నారు. పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టకాలంలో పని చేసిన నిజమైన నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడుతుంటే, పార్టీలు మారి వచ్చిన నాయకులు పెత్తనం సాగిస్తున్నారు. దీంతో అసలైన కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇల్లందు నియోజకవర్గ ఎంఎల్ఏ కోరం కనకయ్యకు కామేపల్లి మండలం తలనొప్పిగా మారింది. దీంతో కామేపల్లి మండలానికి ఎంఎల్ఏ రావాలంటేనే అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ జిల్లా, రాష్ట్ర అదిష్టానం స్పందించి కామేపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ వర్గ పోరు లేకుండా చూడాలని నికార్సైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

## ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజావాణి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి అర్జీలు సమర్పించే ప్రజల సౌకర్యార్థం ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశ్యంతో నేటి నుండి (ఆగస్టు 17వ తేదీ నుంచి) ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణితో పాటు, ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను మండల స్థాయిలోని ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తుల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అంబులెన్స్ ఇచ్చారు సరే.. మరి డ్రైవరేడీ..?



సూపరిండెంట్ కిరణ్ వివరణ లో డ్రైవర్ పోస్ట్ మంజూరు చేయాలని అనుమతి కోసం తెలిపామని అన్నారు. డ్రైవర్ పోస్టు మంజూరు చేయాలని లేని ఎడల ఉద్యమాలు చేసి సాధించుకుంటామని మండల ప్రజలు కోరుతున్నారు.

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి ఏరియా వైద్యశాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. నిత్యం రోగులకు సేవలు అందిస్తూంటారు. సినిమా నటులు సైతం విరాళాలు అందించారు. వైద్యులు ఉన్నారు. కొంత సిబ్బంది కొరత ఉన్నా ఓపి లో అనుదినము 200 నుండి 300 వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. నూతనంగా రూ.8 కోట్ల తో భవనం నిర్మించి అందులో వైదశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడే కొసమెరుపు ఉన్నది. వైద్యశాల కు లక్షలు వెచ్చించి అంబులెన్సు కొనుగోలు చేశారు. కానీ డ్రైవర్ పోస్టు నియామకం మరిచారు. రోగులు అంబులెన్సు వియోగించుకోవాలి అంటే డ్రైవర్ లేదు. ఎక్కువ శాతం రోగులను ఖమ్మం, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు మెరుగయిన చికితకోసం తరలిస్తారు. కానీ ఉపయోగం లేదని డ్రైవర్ లేదని వైద్యులు తెలుపుతారు. డ్రైవర్ లేకుండా అంబులెన్సు ఎందుకు అని రోగులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు ముందు చూపులేకుండా వ్యవహరించే తీరుపట్ల సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యశాల

## వైరాలో 'కారు'కు డ్రైవర్ ఎంపిక ఎప్పుడో..?

-మదన్‌లాల్ మరణం తర్వాత నాయకత్వంపై
కొనసాగుతున్న సందిగ్ధత
-అయోమయంలో పార్టీ క్యాడర్




**ప్రజాపక్షం/వైరా:** స్వర్గీయ బానోతు మదన్‌లాల్ మరణం తర్వాత వైరా నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ పార్టీకి బలమైన కేడర్ ఉన్నప్పటికీ, పార్టీని ముందుండి నడిపించే నాయకత్వం ఎవరిది? అనే ప్రశ్న ప్రస్తుతం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గానికి ఇంచార్జిని నియమించడంపై రాష్ట్ర నాయకత్వం ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో కేడర్‌లో కొంత అసహనం, అయోమయం నెలకొన్నట్లు తెలుస్తుంది. మదన్‌లాల్ మరణం అనంతరం జరిగిన వైరా మున్సిపల్ ఎన్నికల్లోను స్పష్టమైన నాయకత్వం లేకపోయినా మాజీ ఎంపిపి, బిఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కట్టా కృష్ణార్జునరావు సారధ్యంలో సీనియర్ నాయకులు వనమా విశ్వేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, మద్దెల రవి, దొంతబోయిన వెంకటేశ్వర్లు, చిలకా కోటయ్యతో పాటు పలువురు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పార్టీకి అండగా నిలిచారు. అధికార కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొంటూ పార్టీ అభ్యర్థుల కోసం క్షేత్రస్థాయిలో పనిచేశారు. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో ఒక్కొక్కరు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆశావాహ అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటుండంతో కేడర్‌లో అయోమయం పెరుగుతుందనే చర్చ సాగుతుంది. ఎవరితో కలిసి తిరగాలి? ఎవరి వెంట నడవాలి? భవిష్యత్తులో పార్టీ టికెట్ ఎవరికి దక్కుతుంది? ఒక నాయకుడి వెంట ఉంటే మరో నాయకుడి నుంచి వ్యతిరేకత ఎదురవుతుందా? అనే సందేహాలు కార్యకర్తలను వేధిస్తున్నట్లు తెలుస్తుంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నియోజకవర్గంలోని బిఆర్ ఎస్ శ్రేణులకు అందుబాటులో ఉంటూ సమస్య ఏదైనా అండగా ఉంటాననే భరోసా కల్పించారని పార్టీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ప్రస్తుతం అలాంటి సమన్వయ నాయకత్వం లోపించిందనే అభిప్రాయం కొందరు కార్యకర్తల్లో వ్యక్తమవుతుంది.

**కారు బలంగా ఉంది...**
**కాని దానిని నడిపించే డ్రైవర్ ఎవరు?**

కారు బలంగా ఉంది. కాని దానిని నడిపించే డ్రైవర్ ఎవరు అనేది చర్చ ప్రస్తుతం వైరా బిఆర్‌ఎస్‌లో ప్రధానంగా వినిపిస్తుంది. పార్టీకి క్షేత్రస్థాయిలో కేడర్ ఉన్నప్పటికీ , దానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ నేపధ్యంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం వైరా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి పార్టీలో సమన్వయం పెంచేలా వెంటనే నియోజకవర్గ ఇంచార్జిని నియమించి పార్టీకి స్పష్టమైన నాయకత్వాన్ని ఇవ్వాలని బిఆర్‌ఎస్ శ్రేణులు కోరుతున్నాయి.

## అధికారులు సకాలంలో హాజరు కావాలి

**- చుంచుపల్లి ఎంపీడీఓ సుభాషిని**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి సుభాషిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రజా సమస్యలను పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రం తోపాటు అవసరమైన ఆధారాలు, పత్రాల ప్రతులను తీసుకువచ్చి ప్రజావాణిలో సమర్పించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సంబంధిత అధికారులను సంప్రదించే అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## అతడి చేతి వంట.. అద్భుతమేనట..!

**ఒక్కసారి రుచి చూస్తే**
**మళ్లీ మళ్లీ వెళ్లాల్సిందే..!**



**ప్రజాపక్షం/కరకగూడెం:** వంట అంటే ఆడవారికే పరిమితం అనే అభిప్రాయాన్ని చెరిపేస్తూ, తన అద్భుతమైన వంట నైపుణ్యంతో అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు పఠాన్ ఇన్ షావలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరగూడెం మండలం గొల్లగూడెం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే చిన్నపాటి రేకుల ఇంట్లో నివసిస్తున్న రాము, తన చేతి వంటతో స్థానికులతో పాటు దారిన వెళ్లే ప్రయాణికుల మనసులు గెలుచుకుంటున్నాడు. సాయంత్రం వేళ కట్టెల పొయ్యిపై గుమగుమలాడే వేడి వేడి బజ్జీలు, బోండాలు, మిర్చి బజ్జీలు, ఆలు బజ్జీలు తయారు చేస్తూ నోరూరించే రుచులను అందిస్తున్నాడు. ఒకసారి అతని చేతి వంట రుచి చూసిన వారు మళ్లీ తప్పకుండా అక్కడికే వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. చిన్న కుటుంబ కార్యక్రమమైనా, పుట్టినరోజు వేడుకైనా, ఇతర శుభకార్యాలైనా రుచికరమైన వంటకాలతో అందరినీ మెప్పిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు రాము. సాంప్రదాయ పద్ధతిలో, నాణ్యమైన పదార్థాలతో, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ వంటలు చేయడం అతని ప్రత్యేకతగా నిలుస్తోంది. వంట చేయడం అనేది మహిళలకే పరిమితం కాదు. ఆసక్తి, నైపుణ్యం ఉంటే ఎవరైనా మంచి వంటకారులుగా రాణించవచ్చు అనే విషయాన్ని తన పనితనంతో రాము నిరూపిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం ప్రారంభించిన ఈ చిన్న ప్రయత్నం, నేడు గ్రామ ప్రజల ఆదరణతో విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతి సాయంత్రం రాము దుకాణం వద్ద వేడి వేడి వంటకాల కోసం ప్రజలు క్యూ కడుతున్నారు. రుచి, నాణ్యత, మర్యాదపూర్వక సేవతో అతను స్థానికంగా మంచి పేరు తెచ్చుకున్నాడు. చిన్న రేకుల ఇంటి నుంచి ప్రారంభమైన ఈ ప్రయాణం... నేడు వంట కళకు చిరునామాగా మారింది. తన చేతి వంటతో అందరి మనసులు గెలుచుకుంటూ మగవాళ్లు కూడా వంటలో అద్భుతాలు చేయగలరు అని మరోసారి చాటిచెబుతున్నాడు పఠాన్ ఇన్ షావలి (షేక్ రాము) అని కూడా మండల ప్రజలు సరదాగా పిలుస్తారు.

## ఉపేంద్రకు ఉత్తమ అధికారి పురస్కారం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ, అటవీ భూమికి సంబంధించిన వివాద పరిష్కారంలో అత్యంత చొరవ చూపినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కృష్ణసాగర్ బీట్ అధికారి(ఎఫ్‌బీఓ)భూక్య ఉపేంద్రకు అరుదైన గౌరవం దక్కింది. వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(సీసీఎఫ్)డా భీమా నాయక్ చేతుల మీదుగా భూక్య ఉపేంద్ర ఉత్తమ అధికారి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అటవీ భూమికి సంబంధించిన కేసు హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో సంబంధిత అంశాల పరిష్కారానికి సమర్ధవంతంగా కృషి చేయడంతో పాటు, విధి నిర్వహణలో చూపిన చొరవను అధికారులు గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. భూక్య ఉపేంద్రకు అవార్డు లభించడం పట్ల అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఘనంగా శ్రావణమాస బోనాలు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మండల పరిధిలోని కె లక్ష్మీ పురం గ్రామంలో శ్రావణమాస బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పుల మోతలు, భక్తుల సందడితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

## కారేపల్లిలో మాజీ ఎంఎల్ఏ పర్యటన



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాజీ వైరా ఎంఎల్ఏ లావుడియా రాములు నాయక్ ఆదివారం కారేపల్లి మండలంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. వెంకటీయా తండాలో ఇటీవల మృతి చెందిన ఫారెస్ట్ అధికారి బానోత్ నవీన్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన తండ్రి, మాజీ ఎంపీపీ బానోత్ దేవుల నాయక్, భార్య, పిల్లలను ఓదార్చారు. అనంతరం చిన్న కట్టుగూడెంలో దిశా కమిటీ మాజీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్, జర్నలిస్టు రాము నాయనమ్మ అంజి దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, సర్పంచ్ ధారావత్ మంగీలాల్, ఆడప పుల్లారావు, మాజీ సర్పంచ్ బానోత్ శంకర్, భగవాన్‌దాస్, వాంకుడోత్ కృష్ణ, నాయకులు అజ్మీర వీరన్న, డాక్టర్ బాబులాల్, గోపాల్, గుగ్గులోత్ నవీన్, యుగంధర్, రవి, బానోత్ చక్రం, మాజీ ఎంపీటీసీ లాలు, బుచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని లింగంబంజర్, రామలింగాలపల్లి, కారేపల్లి క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. లింగంబంజర్‌లో మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రధానకూడలిలోని బొడ్రాయి వద్ద జలాభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు, పాడిపంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలే కాంగ్రెస్ పార్టీకి పునాది

**మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామ కమిటీలే పార్టీకి పునాధిరాళ్లగా నిలుస్తాయని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ అన్నారు. మండలం లోని గువ్వలగూడెం లో ఆదివారం కాంగ్రెస్ గ్రామ కమిటి సమావేశం ను నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ నూతన కమిటిని ఎన్నుకున్నారు. గ్రామ కమిటి అధ్యక్షుడు గా జిల్లపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గా ఎస్.కె.చిన్న ఖాసిం, కోశాధికారి గా అంగడాల పెద్ద ఎర్రయ్య లతో పాటు మరో 25 మందిని కార్యవర్గం సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ కమిటి పటిష్టంగా ఉంటేనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల గురించి నూతన కమిటి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చేస్తున్న అభివృద్ధి ని ప్రతీ గడప కు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కమిటి బాధ్యతగా పని చేస్తూ ఇటు పార్టీకి, అటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాలోనే గువ్వలగూడెం కమిటి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ రావెళ్ల జ్యోతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

**-శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి**
**-ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నగర సమితి సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అన్నారు. దీనిని శక్తి శాఖలో కల్పడం వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతీనే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేటు పరమైతే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి కానీ ఆ విద్యకు దూరం చేసే చర్యలు ఉండకూడదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం. 97ను ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్, పవన్, కొమరం మహేష్, సాయి, చరణ్, గోపి, నరేందర్, పవన్, కార్తీక్, వెంకట్ పాల్గొన్నారు.

## కలుషిత నీరు అని చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ దిద్దుపూడి 15వ వార్డులో కలుషిత త్రాగునీరు సరఫరా అవుతుందని, వాటర్ ట్యాంకుల్లో కోతుల కళేబరాలు ఉన్నాయని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో కొందరు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తాను కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు మాత్రమే అవుతుందని, రెండు సంవత్సరాలుగా వాటర్ ట్యాంకులు శుభ్రం చేయలేదంటూ తనపై ఆరోపణలు చేయడం అవాస్తవమన్నారు. ప్రజాక్షేత్రంలో గెలవలేని వారు చిల్లర రాజకీయాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారాలతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు వార్డుల ఇంటింటా సర్వే నిర్వహించగా డయేరియా, వాంతులు, విరేచనాలు, విషజ్వరాలకు సంబంధించిన కేసులు లేవని వెల్లడించారని శైలజ తెలిపారు. ఇకపై ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తా వెంకటయ్య, సిపిఐ నాయకులు అమర్లపూడి అనిల్, అమర్లపూడి లాజర్, నల్లమోతు సురేష్, కిలారు పుల్లారావు, తంబళ్ల పుల్లయ్య, అమర్లపూడి రమేష్, గుజ్జర్లపూడి ఏసోబు, కొనకంచి యేసు, రాము, కొచ్చర్ల రాజు పాల్గొన్నారు.

## జాతీయ పతాకావిష్కరణకు దూరంగా గంగారం ఎస్‌బిఐ

**బ్యాంకు మేనేజర్, సిబ్బంది తీరుపై స్థానికుల ఆగ్రహం**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగిన వేళ మండల పరిదిలోని బి.గంగారం ఎస్‌బీఐ శాఖలో మాత్రం జాతీయ పండుగ వేడుకలు నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుండగా, గంగారం ఎస్‌బీఐ శాఖలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొనడం పట్ల స్థానికులు, ఖాతాదారులు, ప్రజా సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బద్ధకానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మెలిగుతూ, ఖాతాదారులను గంటలు,గంటలు నిరీక్షింపచేసే బ్యాంక్ అధికారులు చివరికి సంవత్సరానికి ఒక్కసారి వచ్చే జాతీయ పతాకాన్ని సైతం ఆవిష్కరించకుండా నిర్లక్ష్యం వహించటం అతిపెద్ద నేరంగా పరిగణించాల్సిందే తక్షణమే ఈ ఘటనపై కలెక్టర్, రీజియనల్ బిజినెస్ ఆఫీస్, ఏజీఎం,నెట్ వర్క్ లేదా జోనల్ స్థాయి అధికారి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ పతాకం ఎగుర వేయ్యకపోవటానికి గల కారణం, ఎవరి అనుమతితో జండా ఆవిష్కరణ చెయ్యలేదు తదితర విషయాలపై బ్రాంచ్ మేనేజర్ స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

## నేటి నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి



**ప్రజాపక్షం/వైరా:** నేటి నుండి వైరా మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి మండల పరిషత్ కార్యాలయంలోనే జరుగుతుంది. మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగుతుంది. మండలాల ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను మండల స్థాయిలోనే ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయాలని అధికారులు సూచించారు. ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తుల కోసం జిల్లా కేంద్రానికి పోవాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు.

## పిండిప్రోలులో అంగరంగ వైభవంగా బోనాలు




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి బోనాలు జాతర అంగరంగ వైభవంగా జరిగింది. జాతర నేపథ్యంలో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆడపడుచులు బోనమెత్తి భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చారు. డీజే చప్పుళ్లతో బాణసంచా కాలుస్తూ భక్తులు సంబురాలు జరుపుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని డీజే చప్పుళ్ల నడుమ ఉత్సాహంగా ఆలయానికి చేరుకున్నారు. ముత్యాలమ్మ తల్లి బోనాల జాతరను పురస్కరించుకుని గ్రామ సర్పంచి కామల్ల సువార్త, ఉప సర్పంచి చామకూరి రాజ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతోపాటు భక్తుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. మార్గమంతా బోనాలతో తరలివచ్చిన మహిళలు, భక్తుల సందడితో పిండిప్రోలు గ్రామం కళకళలాడింది. ఆలయానికి చేరుకున్న భక్తులు ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని, ప్రతీ కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నారు. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు ప్రార్థించారు. ఆధ్యాత్మిక, సంప్రదాయం, ఉత్సాహం కలగలిపి సాగిన ముత్యాలమ్మ బోనాల జాతరతో పిండిప్రోలు గ్రామం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పువ్వాడను కలిసిన వెలుగుమట్ల బాధితులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను వెలుగుమట్ల భూదాన్ బాధితులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఉన్న ఇండ్లను కూల్చివేసి నిరుపేదలను రోడ్లపైన పడేసి జైళ్లలో పెట్టిన బాధితులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అండగా నిలిచారు. భోజనం, మంచినీరు, మెడికల్ క్యాంపులు పెట్టి ఆదుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఇండ్లు కోల్పోయిన బాధితుల తరుపున పోరాడి ప్రభుత్వం దిగివచ్చి ప్లాట్లు ఇచ్చేవరకు అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. మరల రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఇండ్లు కోల్పోయిన వారికి పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని పువ్వాడ అజయ్‌కుమార్ వారికి హామీ ఇచ్చారు.

## నేటి నుంచి మండల స్థాయిలో ప్రజావాణి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నేటి నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రాల్లో ఎంపిడివో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల కేంద్రాల్లో ప్రజావాణి కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించరు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నందున తమ సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## ఉత్తమ తహసీల్దార్‌గా బాబ్జీప్రసాద్

**-చింతకాని నుండి నలుగురు ఉత్తమ అధికారులు ఎంపిక**



**ప్రజాపక్షం/చింతకాని :** 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చింతకాని మండలం నుంచి నలుగురు అధికారులు ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. వీరిలో తహసీల్దార్ బాబ్జీప్రసాద్, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ స్వరూప, పందిళ్లపల్లి ఏఈవో కార్తీక్, నాగులవంచ వసతి గృహ సంక్షేమాధికారి కె వెంకటేశ్వరరావు ఉన్నారు. వీరికి శనివారం ఖమ్మం పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన స్వాంతత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉత్తమ అధికారులుగా అవార్డు పొందిన వీరిని మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీ నాయకులు అభినందించారు.

## 28వ వార్డులో ఘనంగా ముత్యాలమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 28వ వార్డులో శ్రావణ మాసం సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు వేడుకలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తీర్థ ప్రసాదాలను సమర్పించి, భక్తులు స్వీకరించారు. సంప్రదాయ ఆచారాల్లో భాగంగా జంతుబలి కార్యక్రమం కూడా నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారి నామస్మరణతో వార్డులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేడుకలు సందడిగా, భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి.

## ఉప్పలమ్మ పూజలో పాల్గొన్న అజయ్‌కుమార్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వరరావు నివాసంలో ఆదివారం నిర్వహించిన ఉప్పలమ్మ పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు, బిఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాజీ మండల అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్, సింగవరపు నరేష్, పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలి




**-సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరంలో వక్తలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సామాజిక ప్రజాస్వామ్య పరిరక్షణ కర్తవ్యంగా రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు పనిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రెండవ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరిగాయి. ఈ సభలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విలువలతో కూడినదిగా అమలు కావడం లేదని ఈ విషయాన్ని రచయితలు, కవులు గుర్తించాలని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించి చర్చా కార్యక్రమాలను నిర్వహించారు.దేశంలో వర్తమాన పరిస్థితులు, యువత అర్థం చేసుకుంటున్న తీరు, భవిష్యత్తు పరిణామాలను గురించి పలువురు చర్చించారు. ప్రజాస్వామ్యం సాంస్కృతిక సంభాషణ అనే అంశంపై ప్రముఖ కవయిత్రి మార్గరేట్, కథకుడు దాదాహయేత్ తదితరులు ప్రసంగించారు. కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు ప్రసేన్ సమూహ సభల ప్రారంభోపన్యాసం చేయగా విద్యాసాగర్, రూప, రుక్మిణి సమూహ లక్ష్యాలను వివరించారు. ప్రజాస్వామ్యం పౌరసత్వ సమస్య అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్. మల్లారెడ్డి, ప్రముఖ సామాజిక విశ్లేషకులు జహఅరా ప్రసంగించారు. వివిధ అంశాలపై సుంకిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం, ప్రముఖ వైద్యులు ఎంఎఫ్ గోపీనాథ్, ధరణికోట రమేష్, ఫణీ మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమూహ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు.

# జాతీయస్థాయి పోటీలకు కోయచలక వారియర్స్ జట్టు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇషా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు కోయచలక వారియర్స్ (మహిళ) జట్టు ఎంపికైంది. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇషా గ్రామోత్సవ్ పేరిట గ్రామస్థాయి, క్లస్టర్, రాష్ట్ర స్థాయి (డివిజన్), జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా జులై నెలలో నిర్వహించిన త్రో బాల్ జిల్లా స్థాయి పోటీలలో కోయచలక వారియర్స్ జట్టు కెప్టెన్ శృతి ఆధ్వర్యంలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి (డివిజన్) పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కెప్టెన్ శృతి నేతృత్వంలోని రూపా, సుజాత, హిమబిందు, జ్యోత్స్న, రమాదేవి, వెంకటలక్ష్మి, హరిక, శ్రీలక్ష్మి, కోటేశ్వరి క్రీడాకారుల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో సెప్టెంబర్ 6న కోయంబత్తూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో కోయచలక వారియర్స్ జట్టు పాల్గొననుంది.2024, 2025, 2026 లో నిర్వహించిన పోటీలలో కోచ్ హరీష్ నేతృత్వంలో కోయచలక వారియర్స్ జట్టు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించి




జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులకు, కోచ్‌కు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి కోయచలక గ్రామ పేరును ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కెప్టెన్ శృతి మాట్లాడుతూ జట్టులోని క్రీడాకారుల అందరి సహకారంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించినట్లు తెలిపారు.జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించి తమ గ్రామానికి గుర్తింపు తీసుకు వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రెవెన్యూ హద్దులు లేకుండానే వాగులో ఇసుక తవ్వకాలు..?



**-తాళ్లపాయిలో ఇసుక అక్రమ రవాణాపై గ్రామ పంచాయితీ పాలకవర్గం అభ్యంతరం**
**-అనుమతులు ఉన్నా...**
**హద్దులు ఇంకా నిర్ణయించలేదన్న తహసీల్దార్?**
**-ఇసుక తవ్వకాలు, రవాణాపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలోని తాళ్లపాయి గ్రామ పంచాయితీ పరిధిలో ఇసుక తవ్వకాలు, రవాణాపై వివాదం నెలకొంది. రైతుల పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించే పేరుతో గ్రామ పంచాయితీ తీర్మానం లేకుండానే ఇసుకను తవ్వి తరలిస్తున్నారంటూ గ్రామ పంచాయితీ పాలకవర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. గ్రామ పంచాయితీ పరిధిలోని వాగు ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న సమయంలో రెవెన్యూ హద్దులు స్పష్టంగా నిర్ణయించకుండానే ఇసుకను తవ్వి డంపింగ్ చేయడం, తరలించడం ఎలా సాధ్యమని పాలకవర్గ సభ్యులు ప్రశ్నించారు. ఇసుక మేటల తొలగింపు పేరుతో జరుగుతున్న కార్యకలాపాలపై గ్రామ పంచాయితీకి ముందస్తు సమాచారం ఇవ్వడంతో పాటు, సంబంధిత తీర్మానం తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

### హద్దులు నిర్ణయించకుండానే తవ్వకాలు ఎలా....

ఈవిషయంపై గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు తహసీల్దార్ స్వాతి బిందును వివరణ కోరగా, ఇసుక తవ్వకాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయని, అయితే హద్దులు ఇంకా నిర్ణయించలేదని ఆమె తెలిపినట్లు పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. హద్దులు నిర్ణయించక ముందే ఇసుక తవ్వకాలు, డంపింగ్ చేపట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి సంబంధించిన రెవెన్యూ హద్దులు, పరిమాణం, తవ్వకాలకు అనుమతించిన ప్రదేశం తదితర వివరాలను స్పష్టంగా వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇసుక తరలింపు



పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా లేదా అనే విషయంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

### అక్రమ రవాణాను అరికట్టాలి...

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లయితే తక్షణమే అడ్డుకోవాలని గ్రామ పంచాయితీ పాలకవర్గం కోరింది. ఇసుక మేటల తొలగింపు పేరుతో అనుమతించిన పరిమితికి మించి ఇసుకను తరలించకుండా అధికారులు నిఘా పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో తాళ్లపాయి సర్పంచ్ గడ్డ సుజాత, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు కొండ్రు సుందర్రావు, వార్డు సభ్యులు సున్నం సాగర్, కొండ్రు రవితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

### అనుమతులు ఉన్నాయన్న తహసీల్దార్..

ఈవిషయంపై ప్రజాపక్షం స్థానిక తహసీల్దార్ స్వాతి బిందును వివరణ కోరగా, ఇసుక తవ్వకాలకు అన్ని అనుమతులు ఉన్నాయని తెలిపారు. అయితే గ్రామ పంచాయితీ పాలకవర్గం మాత్రం రెవెన్యూ హద్దులు నిర్ణయించకుండానే తవ్వకాలు చేపట్టడంపై అభ్యంతం వ్యక్తం చేస్తోంది. దీంతో ఇసుక తవ్వకాలు, రవాణాకు సంబంధించిన అనుమతులు, హద్దులు, నిబంధనలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

# నేడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె జమలారెడ్డి తెలిపారు. ప్రజలు సమస్యలు, ఫిర్యాదులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన వినతిపత్రాలను ఆధారాలతో సమర్పించవచ్చన్నారు. సంబంధిత అధికారులు స్వీకరించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# ఆత్మగౌరవం కోసం మరో పోరాటంకు సిద్ధం కావాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ఆత్మగౌరవం కోసం మరో పోరాటం కు సిద్ధం కావాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలం లోని పలు గ్రామాలలో పర్యటించారు. ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఆత్మబలిదానాలు చేశారని పేర్కొన్నారు. కానీ నేడు వారి బలిదానాలకు విలువ లేకుండా పోతుందన్నారు. వారి ఆశించిన లక్ష్యం నేరవేరటం లేదన్నారు. అమరవీరుల త్యాగాల ను విస్మరించిందన్నారు. నిధులు, నియమాకాలు మరిచిపోయారన్నారు. మాట తప్పిన ప్రభుత్వం పై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టేందుకు కార్యచరణ ను రూపొందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవం ను కాపాడుకునేందుకు మరో ఉద్యమం కు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. టీజేఏసీ ని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో టీజేఏసీ ని పటిష్టం చేసేందుకు తొలుత డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో టీజేఏసీ నాయకులు గాదరి వెంకన్న, జీ.రవి తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాల్లోకి యువత ముందుకు రావాలి

**ప్రజాపక్షం/కల్లూరుః** రాజకీయాల్లోకి యువత ముందుకు రావాలని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఖమ్మం జిల్లా ఇన్చార్జి గడల శ్రీనివాసరావు యువతను కోరారు. కల్లూరు లోని ఆదివారం టిటిడి కళ్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భవిష్యత్తు యువతదేనని యువకులంతా రాజకీయంపై అవగాహన ఉండి ముందుకు రావాలని కోరారు. పేదల జీవితాలలో వెలుగులు నింపేందుకే యువత రాజకీయ రంగ ప్రవేశం చేయాలని కోరారు. అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకే జనసేన పార్టీ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి తదితర మండలాల నుంచి జనసేన పార్టీ కార్యకర్తలు ఆయా మండలాల ఇన్చార్జులు పాల్గొన్నారు.



# నేడు ప్రజావాణి

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులో సోమవారం ఉదయం 10:30 నుంచి 1:00 వరకు కల్లూరు లోని రైతు వేదిక నందు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల స్థాయిలోని 23 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, ప్రజల యొక్క అర్జీలకు సమస్యలకు పరిష్కారాలు వచ్చిన వినతులను ప్రజావాణి పోర్టల్ నందు నమోదు చేసి జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర స్థాయిలో వారికి పంపించి అట్టి అధికారులు పరిశీలిస్తారని ఇకనుండి జిల్లా ప్రజావాణి కి వెళ్లే అవసరం తప్పుతుందని కనుక ఇట్టి అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలను ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా సమయపాలనలో పాల్గొనాలని పేర్కొన్నారు.



# ప్రాజెక్టులో పడి వ్యక్తి గల్లంతు

**ప్రజాపక్షం/చంద్రుగొండ :** ప్రాజెక్టు కాలువలో పడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన ఆదివారం మండల పరిధిలోని మద్దుకూరు గ్రామ శివారులో జరిగింది. మద్దుకూరు గ్రామానికి చెందిన కురసం కృష్ణ (45) కూలీ పనులకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు సీతారామ ప్రాజెక్టు కాలువలో కాళ్లు కడుక్కుంటుండగా ప్రమాదశాత్తు కాలు జారీ పడ్డాడు. నీటి ఉధృతికి కొట్టుకుపోయినట్లు సహచర కూలీలు తెలిపారు. కృష్ణకు భార్య లీల, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# ఎవరి దారి వారిదే..!



- సాంకేతిక యుగంలో కనుమరుగవుతున్న మానవ సంబంధాలు
- దూరమవుతున్న అనుబంధాలు..
- ఆనాటి పలుకరింపులు కరువు
- ఇంట్లో నలుగురు.. చేతుల్లో ఎనిమిది మొబైల్ ఫోన్లు
- పక్కనే ఉన్న వారితో మాట్లాడేందుకు సమయం లేని పరిస్థితి







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఒకప్పుడు ఉదయం లేవగానే ఇంట్లో పెద్దలకు నమస్కారం.. ఇరుగుపొరుగు వారిని పలకరించడం.. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించడం.. పండుగలు, శుభకార్యాల్లో బంధుమిత్రులతో కలసి సందడి చేయడం సాధారణంగా ఉండేది. కాలం మారింది, సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమయ్యాయి. దీంతో మనుషులు దగ్గరగా ఉన్నా.. మనసులు మాత్రం దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

**ఇంట్లోనే ఎవరి ప్రపంచం వారిదే..**

నేటి పరిస్థితుల్లో ఒకే ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటే వారి చేతుల్లో నాలుగు కాదు.. ఒక్కక్కరి వద్ద రెండు చొప్పున ఎనిమిది మొబైల్ ఫోన్లు కనిపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్ వినియోగం కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు ఒకేచోట కూర్చున్నా పరస్పరం మాట్లాడుకోవడం కంటే సామాజిక మాధ్యమాలు, వీడియోలు, చాటింగ్, ఆన్‌లైన్ కార్యక్రమాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు.

**పలకరింపులకు కాలం చెల్లిందా?**

గతంలో ఇరుగుపొరుగు వారు ఎదురుపడితే ఆప్యాయంగా పలకరించుకునేవారు. వీధిలో పెద్దలు కనిపిస్తే పిల్లలు గౌరవంగా నమస్కరించేవారు. ఇంటికి బంధువులు వస్తే గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. ఇప్పుడు పక్కింట్లో ఎవరు ఉంటున్నారో కూడా తెలియని పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. ఎదురుగా వచ్చినా చిరునవ్వుతో పలకరించడానికి బదులు చేతిలోని ఫోన్ వైపు చూస్తూ వెళ్లిపోతున్నారు.

**కుటుంబంలోనూ పెరుగుతున్న దూరం..**

సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ దాని అతివినియోగం కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపుతోంది. తల్లిదండ్రులు, పిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకునే సమయం తగ్గుతోంది. పిల్లలతో మాట్లాడాల్సిన తల్లిదండ్రులు ఫోన్‌లో నిమగ్నమవుతుండగా.. తల్లిదండ్రులతో సమయం గడపాల్సిన పిల్లలు మొబైల్ గేమ్స్, సోషల్ మీడియా, వీడియోలతో మునిగిపోతున్నారు. భార్యాభర్తలు ఒకే గదిలో ఉన్నా ఎవరి ఫోన్‌లో వారు నిమగ్నమవడం.. భోజన సమయంలోనూ ఫోన్‌ను పక్కన పెట్టలేకపోవడం నేటి జీవితంలో సాధారణ దృశ్యంగా మారింది.

**పండుగల సందడీ.. ఫోన్ స్క్రీన్‌లోనే..**

ఒకప్పుడు పండుగలు కుటుంబ సభ్యులందరినీ ఒకచోట చేర్చేవి. బంధువులు, స్నేహితులు కలుసుకుని ఆనందంగా గడిపేవారు. ఇప్పుడు పండుగ సందర్భాల్లోనూ ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కళ్లముందు ఉన్న ఆనందాన్ని ఆస్వాదించడం కంటే దాన్ని ఫోన్‌లో బంధించి ఇతరులకు చూపించాలనే తపన పెరిగింది.

**సాంకేతికత అవసరమే.. కానీ హద్దు ఉండాలి:**

సెల్‌ఫోన్, ఇంటర్నెట్ ఆధునిక జీవితంలో తప్పనిసరి అవసరాలుగా మారాయి. విద్య, ఉద్యోగం, వ్యాపారం, సమాచార సేకరణ, అత్యవసర సేవలు వంటి అనేక రంగాల్లో సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోంది. అయితే అవసరానికి మించి వినియోగించడం వల్ల మానవ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రోజులో కొంత సమయాన్ని మొబైల్‌కు దూరంగా ఉంచి కుటుంబ సభ్యులతో మాట్లాడటం, పిల్లలతో ఆడటం, పెద్దలతో కాసేపు ముచ్చటించడం వంటి చిన్న చిన్న మార్పులు కుటుంబ అనుబంధాలను బలోపేతం చేస్తాయని సూచిస్తున్నారు.

**మళ్లీ ఆ పలుకరింపులు రావాలి..**

సాంకేతికతను వదిలేయాల్సిన అవసరం లేదు.. కానీ మనుషులను మాత్రం మర్చిపోకూడదు. పక్కనే ఉన్న వ్యక్తితో మాట్లాడేందుకు ఫోన్ అవసరం లేని పరిస్థితిని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, రోజులో కొంతసేపు మాట్లాడుకోవడం, ఇరుగుపొరుగు వారిని పలకరించడం వంటి అలవాట్లు మానవ సంబంధాలను నిలబెట్టగలవు. చేతిలోని మొబైల్ మనిషికి సాధనం కావాలి.. మనిషే మొబైల్‌కు బానిస కాకూడదు. లేదంటే ఒకే ఇంట్లో ఉంటూ కూడా.. ఎవరి దారి వారిదే అన్న పరిస్థితి మరింత పెరిగే ప్రమాదం ఉంది.

## మిత్రుడిని కోల్పోయిన బాధ మాత్రం వర్ణనాతీతం

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం తాటి గూడెం గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహితుడు, కరకగూడెం ఆశ్రమ పాఠశాలలో చదివి ఉద్యోగరీత్యా భద్రాచలం మొబైల్ కోర్ట్ లో న్యాయవాది గా సేవలందిస్తూ చందా హనుమంతరావు అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో ఆయన 1996 బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులు సుమారు 30 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్నారు. హనుమంతరావు మృతి విషయం తెలుసుకున్న మిత్రులు దశదినకర్మల కార్యక్రమానికి హాజరై ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో మిత్రుల మధ్య ఆనందం వెల్లివిరిసింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అయితే తమ ప్రియమైన మిత్రుడు ఇక లేరనే బాధ వారిని కలచివేసింది. స్నేహితుడిని కోల్పోయిన విషాదంలోనూ, ఇన్నేళ్ల తర్వాత అందరూ ఒకచోట కలవడం ఆనందాన్ని కలిగించింది. దశదినకర్మల కార్యక్రమంలో పాల్గొన్న బాల్యమిత్రులు చందా హనుమంతరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, ఏ అవసరం వచ్చినా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని మిత్రుని భార్యకు భరోసా ఇచ్చారు. బాల్యస్నేహం కాలంతో పాటు దూరమైనా, మనసుల మధ్య అనుబంధం ఎప్పటికీ చెక్కుచెదరదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు తోలెం శ్రీనివాసరావు, సత్యనారాయణ, లక్ష్మణ్, గాంధీ, వసంతరావు, ఉస్మాన్ రావు, కృష్ణ, రాంబాబు, వెంకటరమణ, సాంబశివరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల:** ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటకనే పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. కొణిజర్ల మండలం అమ్మపాలెం లోని గురుకుల పాఠశాలలో జరిగిన టిఎస్‌టియుఎఫ్ కొణిజర్ల మండల 13వ మహాసభలో ఆయన మాట్లాడారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, ఆరు డీఏలు, ఈకుబేర్ పెడింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందించాలని, కెజిబివి, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయులకు జీరో010 ద్వారానే వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో టిఎస్‌యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎం.ప్రసాదరావు ఎన్నికయ్యారు.

## కొణిజర్లలో హైమాస్ లైట్ల పరిశీలన



**ప్రజాపక్షం/కొణిజర్ల:** వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సహకారంతో నియోజకవర్గంలో 200 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కొణిజర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు, సర్పంచ్ గూదె పుష్పావతి, పిఏసిఎస్ చైర్మన్ రమేష్, ఉప సర్పంచ్ గోపయ్య(మోష), యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్తారావు, వార్డు సభ్యుడు నాగేశ్వరరావు, మురళి, వెంకట్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా మండలంలో ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు







**ప్రజాపక్షం/వైరా:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో జరిగిన ఉత్తమ అధికారుల ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమంలో వైరా మండలానికి చెందిన ముగ్గురు అధికారులు ఉత్తమ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేశారు. మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, పంచాయతీరాజ్ డిఈ కడాలి వెంకటేశ్వరరావు, వైరా సబ్ రిజిస్ట్రార్ కార్తీక్ తమ వృత్తి నైపుణ్యం ప్రజలకు అందించిన సేవల్లో చూపిన ప్రతిభకు గాను ఈ గౌరవాన్ని పొందారు. ప్రజాసేవలో వారి కృషిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్న ముగ్గురికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉప్పు హనుమంతరావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన ఉప్పు హనుమంతరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పు హనుమంతరావును శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కులు, సంక్షేమం కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం చేస్తున్న కృషిని సత్తుపల్లి నియోజకవర్గంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేస్తూ బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలో బీసీ సంక్షేమ సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి, బీసీల ఐక్యత, హక్కులు, ఆత్మగౌరవం కోసం నిరంతరం కృషి చేస్తానని ఉప్పు హనుమంతరావు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్‌తో పాటు సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి టౌన్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కమల్ పాషా, అలవాలా కరుణాకర్ బాజీ, దేవల్ల శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొని ఉప్పు హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపారు.